తస్మాత్ జాగ్రత్త..

- పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- తోడవుతున్న సైబర్‌నేరాలు
- బలవుతున్న అమాయకులు
- సరదాలకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్న పలువురు



నేరడిగొండ: జిల్లాలో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. చిన్నాపెద్దలు ఆన్‌లైన్ ఆటలు ఆడి మోసపోతున్నారు. రూ.వందలతో మొదలుపెట్టి రూ.లక్షల్లోకి వెళ్తున్నారు. ఈక్రమంలో ఫోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఇవి తిరిగి కట్టకపోతే..వారి బంధువులకు, మిత్రుల ఫోన్ నంబర్లకు అసభ్యంగా ఉండే చిత్రాలను మార్ఫింగ్ చేసి పంపుతున్నారు. దీంతో పరువు కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు అప్పులు చేసి మరీ రుణాలు చెల్లిస్తున్నారు. జిల్లాలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా విద్యార్థులు, యువకులు ఈ వలలో చిక్కుకొని తీవ్రంగా నష్టపోతున్నారు. తొలుత పెట్టిన డబ్బులకు రెట్టింపు వస్తాయనే ఆశతో ఎక్కువ మొత్తంలో జమ చేస్తుంటారు. ఈ మొత్తంలో 15 శాతం వరకు కమీషన్ రూపంలో ఆన్‌లైన్ కంపెనీలు నగదు లాగేసుకుంటున్నాయి.

సరదాగా మొదలు..

సరదాగా మొదలుపెట్టిన ఆన్‌లైన్ ఆటలు చివరకు అప్పులతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి తీసుకొస్తున్నాయి. యువత మొదలుకొని సాఫ్ట్‌వేర్ కొలువుచేసే ఉద్యోగుల వరకు పెద్దమొత్తంలో తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే అత్యాశతో ఆన్‌లైన్ ఆటలకు అలవాటుపడుతున్నారు. ఇది చివరకు ఫోన్ ద్వారా రుణాలు తీసుకునేస్థాయికి చేరి, అక్కడ నగదు అంతా పోవడంతో అప్పులు కట్టలేని స్థితిలో..తల్లిదండ్రులకు చెప్పలేక.. రుణాలు తీర్చాలనే ఒత్తిడి పెరిగి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

నిషేధించినప్పటికీ..యథేచ్ఛగా..

రాష్ట్రప్రభుత్వం ఆన్‌లైన్ ఆటలను కొన్నింటిని నిషేధించింది. జిల్లాలోని కొందరు..కొన్నిరకాల యాప్‌లు, ఇతర రాష్ట్రాల ఐపీలతో డౌన్‌లోడ్ చేసుకొని లొకేషన్ మార్చి మరీ ఆడుతున్నారు. కొన్నిరకాల ఆటలకు పాన్‌కార్డు నంబర్, బ్యాంక్ ఖాతా, మెయిల్ ఐడీ వివరాలు నమోదు చేస్తేనే అందులో కొనసాగేందుకు అనుమతులుంటాయి. వీటిని ఇవ్వడంతో సైబర్ నేరాలకు దారితీస్తున్నాయి. ఎన్ని జరిగినా వాటిని ఆడేందుకు యువత వెనకడుగు వేయడం లేదు. ఇప్పటివరకు ఈ ఆటలతో నష్టపోయి రోడ్డునపడిన వారే తప్ప డబ్బు సంపాదించిన వారు ఏ ఒక్కరూ లేకపోవడం గమనార్హం.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి



బ్యాంక్ రుణం పొందాలంటే ఎన్నో ఆంక్షలుంటాయి. కానీ ఇలాంటివి లేకుండా ఫోన్ యాప్‌లు రుణాలిస్తున్నాయంటే..ఈ విషయమై విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆలోచించాలి. ఆన్‌లైన్‌లో వివిధ రకాల మోసపూరితమైన గేమ్స్ ఉంటాయి. అత్యాశకు పోయి వాటికి బానిసలై ఆర్థికంగా నష్టపోవద్దు. కష్టమొస్తే పోలీసులను ఆశ్రయించాలే తప్పా ఆత్మహత్యలు పరిష్కారం చూపవు. పిల్లలు, యువకుల కదలికలపై తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉంచాలి. ఆన్‌లైన్ ఆటలకు బానిసవుతున్న వారి సమాచారం మా దృష్టికి తీసుకువస్తే కౌన్సెలింగ్ నిర్వహిస్తాం.

– శ్రీకాంత్, ఎస్సై, నేరడిగొండ

క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తాంసి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని బండల్‌నాగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటగదిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయురాలు, సిబ్బంది ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం పేర్కొన్నారు. సంకాంతి పండుగ పురస్కరించుకొని మండలంలోని దొడందా గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు మెస్రం నాగ్‌నాథ్, గ్రామపెద్దలు పవార్ దుదిరావ్, తుంరం మల్కు, రాథోడ్ రవీందర్, జాదవ్ హరినాయక్, రాథోడ్ దత్తారం, రాథోడ్ ఉత్తం, తుంరం ప్రభ, సుర్పం జుగాదిరావ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్, మావల మండలాల్లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బోధనేతర పోస్టుల భర్తీ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సరోజ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో నైట్ ఉమెన్ వాచ్‌మెన్ 1, మావల మండలంలోని హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 1, నైట్ వాచ్‌మెన్ ఉమెన్ పోస్ట్ 1, డే వాచ్‌మెన్ ఉమెన్ పోస్ట్, స్వీపర్ 1 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, ఉన్న మహిళా అభ్యర్థులు ఆయా ఎంఈవో కార్యాలయాల్లో ఈనెల 10లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక

నేరడిగొండ: ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గజ్జల అశోక్, ఉపాధ్యక్షుడిగా చుంచు రవి, ప్రధాన కార్యదర్శిగా బిక్కి రాకేశ్, అధికార ప్రతినిధిగా గద్దెల సంతోష్, కార్యదర్శిగా ఒడ్డెపల్లి సురేష్, సంయుక్త కార్యదర్శిగా సిర్ర గంగాధర్, ప్రచార కార్యదర్శిగా జూల అడెల్లు, కార్యవర్గ సభ్యులుగా జొన్నల అశోక్, అంకుష్, అడెల్లు, ప్రశాంత్, జ్ఞానేశ్వర్, మహేశ్, ప్రవీణ్, దీపక్‌లను ఎన్నికయ్యారు. మండల ఇన్‌చార్జి గజ్జల శంకర్ అధ్యక్షతన ఎన్నిక జరిగింది. రాష్ట్ర సీనియర్ నాయకులు కుడాల స్వామి, కాంబ్లే బాలాజీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్‌లు పరిశీలకులుగా వ్యవహరించారు.

శరవేగంగా గోదాం పనులు

తాంసి: మండలంలోని అర్లి(టి) గ్రామంలో గోదాం నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తాంసి ప్రాథమిక సహకారం సంఘం ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో ఎరువుల గోదాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రైతుల కోసం ఎరువులను నిల్వ చేసేందుకు నిర్మిస్తున్న గోదాం పనులు వేగంగా జరగడంతో గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్‌సీజన్ నాటికి గోదాం పనులు పూర్తి చేస్తామని సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న రవీందర్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి రవీందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు మోసిన్, మురళీ, శ్రీనివాస్, సువర్ణ తదితరులు ఉన్నారు.

గిరి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నాగల్‌కొండ-మాన్కాపూర్ బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

నార్నూర్: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని నాగల్‌కొండ నుంచి మాన్కాపూర్ వరకు రూ.4 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం, రూ.50 లక్షలతో షెడ్డు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులే ఈ ఏడాది వరకు కొనసాగుతున్నాయన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్రభుత్వం సహకరించడం లేదని, నిధుల మంజూరులో వివక్ష చూపుతుందని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ నాయకులు సహకరించాలని కోరారు. ఏదైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి గాని అభివృద్ధిలో వివక్ష చూపకూడదన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యాం నాయక్ మాట్లాడుతూ గతంలో చేసిన అప్పులకే వడ్డీ కట్టేందుకు ప్రభుత్వం వద్ద డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమన్నారు. త్వరలో రైతులకు రైతు భరోసా ఇస్తామన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ సమస్యలతోపాటు గిరిజన గ్రామాలు ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ప్యాక్స్ చైర్మన్ ఆరె సురేష్, మాజీ ఎంపీపీ కనక మోతుబాయి, మాజీ ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఊర్వేత రూపదేవ్, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

- జీసీడీవో మెస్రం ఛాయ



అర్జుని బాలికల ఆశ్రమ పాఠశాలలో బోధన వివరాలు తెలుసుకుంటున్న జీసీడీవో మెస్రం ఛాయ

నార్నూర్: బాలికలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. గాదిగూడ మండలంలోని అర్జుని బాలికల ఆశ్రమ ఉన్నత, కొలంగూడ శాటిలైట్ సెంటర్ పాఠశాలలు మంగళవారం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యాబోధన, ఆరోగ్య సమస్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలలో అమలు చేస్తున్న గిరిజన పోషణ్ మిత్ర పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. విద్యార్థినులకు మహువా లడ్డూ, ఐరన్ టాబ్లెట్స్ వారానికి రెండు సార్లు, ఇవ్వాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థ బాగుంటేనే అభివృద్ధి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మినీ గురుకులంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీలు

బేల: విద్యావ్యవస్థ బాగుంటేనే అన్నింటా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మండలంలోని దేవ్‌జీగూడలో పీఎం జన్‌మన్ నిధులు రూ.60 లక్షలతో మల్టీపర్పస్ కేంద్రం భవనం, సదల్‌పూర్‌లోని ఎస్టీ బాలికల మినీ గురుకులం ప్రాథమిక పాఠశాలలో ఆర్టికల్ 275(1) నిధులు రూ.40 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎంపీ గోడం నగేశ్‌తో కలిసి మంగళవారం శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే కుటుంబంతోపాటు సామాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయని తెలిపారు. జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సవాపురే విలాస్, నాయకులు బోయర్ విజయ్, దత్తా నిక్కమ్, రామెల్లి మోరేశ్వర్, బోనిగిరివార్ గణేశ్, మెంచు నరేందర్, పెందుర్ రాందాస్, కొడప అరుణ్, సలాం దేవ్‌రావు, బోడకుంటి రాకేశ్, శాక్రే సందీప్, ఇంద్రశేఖర్, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోవాలి'

- ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్



మాట్లాడుతున్న యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి: కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ కోరారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో బాలాజీ సోలార్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సూర్యఘర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల విలువ గల సోలార్ విద్యుత్ ప్లేట్లు రాయితీపై రూ.78 వేలకు మంజూరు చేస్తోందన్నారు. ఆసక్తి ఉన్నవారు బాలాజీ సోలార్ ఏజెన్సీకి సంప్రదించాలని సూచించారు. ముత్నూర్ పంచాయతీ పరిధిలో 81 కుటుంబాలను అధికారులు గుర్తించారని, త్వరలో సోలార్ విద్యుత్ సిస్టంను అమర్చుతారని తెలిపారు. ఏజెన్సీ నిర్వాహకులు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికసంస్థల్లో వందశాతం గెలుపే లక్ష్యం'

కైలాస్‌నగర్: ఏఐసీసీ నేతలు, పీసీసీ అధ్యక్షుడు అందించిన స్ఫూర్తితో స్థానికసంస్థల్లో వందశాతం గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఈనెల 6న నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటరీ విస్తృతస్థాయి సమావేశం విజయవంతం కావడంతో జిల్లాకేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో పలువురు పార్టీ నాయకులు మంగళవారం ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో జాతీయ, రాష్ట్ర ముఖ్య నాయకులతో స్థానికసంస్థల ఎన్నికలపై నిర్వహించిన ముందస్తు సమావేశం విజయవంతమైందన్నారు. సభకు హాజరై జయప్రదం చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ నేతలకు సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా పర్యటనకు వచ్చినా ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ పెరుమాళ్, ప్రోటోకాల్ చైర్మన్ వేణుగోపాల్‌లను కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం మావలలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం జిల్లాలోని రాజకీయాలు, తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, మాజీమంత్రి వేణుగోపాలాచారి, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఆడే గజేందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌నాయక్, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, సారంగాపూర్ మాజీ జెడ్పీటీసీ పత్తి రాజేశ్వర్‌రెడ్డి, ఏఐసీసీ మెంబర్ నరేశ్ జాదవ్, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్ కాలనీకి చెందిన జంజర్‌కర్ అమూల్(30) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన సలీం అలియాస్ కలీం.. జంజర్‌కర్ అమూల్‌ను సోమవారం భయాందోళనకు గురిచేశాడు. అమూల్ ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కాగా, తనను వేధింపులకు పాల్పడుతున్నారని అమూల్ సూసైడ్‌నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. అమూల్ మృతి కారకుడు సలీంను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

నూతన పంచాయతీగా ఏర్పాటు చేయండి

బోథ్: మండలంలోని పార్డి(కే) గ్రామ పంచాయతీలోని గోల్లాపూర్, మామిడిగూడ, గొల్లాపూర్‌తండా గ్రామాలను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు కోరారు. మంగళవారం ఎంపీడీవో రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మామిడిగూడ, గొల్లాపూర్, గొల్లపూర్ తండాలను కలిపి ఒక పంచాయతీగా, పరుపులపల్లె, టివిటిపల్లె గ్రామాలను ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని వారు కోరారు. నూతన సొనాల మండలంలో మరో రెండు పంచాయతీలు పెరిగే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల, లాలూరామ్, తొడసం ముత్యం, దత్తు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రమేశ్ మృతి తీరని లోటు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ నాయకుడు రోకండ్ల రమేశ్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రమేశ్ సంతాపసభ నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1987లో తాను రాజకీయాల్లో వచ్చేందుకు ఆయన ఎంతో ప్రోత్సహించారని జోగు రామన్న గుర్తు చేసుకున్నారు. ఆయా పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు దర్శనాల మల్లేశ్, ప్రహ్లాద్, బండి దత్తాత్రి, నారాయణ, సచిన్, కిరణ్, ఆశన్న, యూనీస్ అక్బానీ, సాజిదొద్దిన్, బొర్రన్న, యాసం నర్సింగ్ తదితరులు ఉన్నారు.

రాజేశ్వర్‌రెడ్డి సేవలు మరువలేనివి

నేరడిగొండ: నేరడిగొండ గ్రామ సర్పంచ్‌గా ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కొనియాడారు. మండల కేంద్రంలోని రాజేశ్వర్‌రెడ్డి నివాసం వద్ద మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీడీసీ చైర్మన్, సర్పంచ్‌గా నేరడిగొండ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ అంబేకర్ పండరి, బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, నాయకులు సాబ్లే ప్రతాప్‌సింగ్, ఆడే బాబులాల్, రాథోడ్ సురేందర్, సురేందర్ యాదవ్, సుశీల్, గులాబ్ సింగ్, రమణాగౌడ్ తదితరులు ఉన్నారు.

టీఎంఎల్ ఉపయోగించి బోధన చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థుల విద్య అభివృద్ధి కోసం కృత్యాధార బోధన టీఎంఎల్ ఉపయోగించి బోధన చేయాలని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం శైలజ అన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు డ్రాప్ అవుట్ లేకుండా ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని పేర్కొన్నారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇటీవల గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నూతనంగా సీఆర్పీగా నియమించిన ఆత్రం మధుసూదన్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు ఇస్తారి, పూసం దామోదర్, మడావి అశోక్, గేడం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి-హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్షభూమి జాతర వద్ద క్రీడా పోటీలను దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్‌నాయక్ గ్రామపెద్దలు మంగళవారం ప్రారంభించారు. 11న దీక్షభూమి వద్ద నిర్వహించే గురుకృప దినోత్సవం సందర్భంగా జాతర ఉత్సవాలు ప్రారంభమైనట్లు వారు తెలిపారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామపెద్దలు తాక్రునాయక్, చౌహాన్ డిగాంబర్, రాథోడ్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే సమర శంఖరావం కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో ఆవిష్కరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అధికసంఖ్యలో తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు కోరారు. నాయకులు కలాల శ్రీనివాస్, మ్యాకల అశోక్, కాసర్ల శ్రీనివాస్, సామల ప్రశాంత్, నరేశ్, రాజు, చంద్రశేఖర్, నర్సింలు, దశరథ్, స్వామి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అడానేశ్వర సప్తాహం

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని టీచర్స్ కాలనీలో స్థాపించిన శ్రీ నీలోమ ఆడానేశ్వర సేవాశ్రమంలో బుధవారం నుంచి శ్రీ సద్గురు అడానేశ్వర సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సచిన్ దేశ్‌పాండే ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అడానేశ్వరుని మహా సమాధి దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 15 వరకు సేవాశ్రమంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏడు రోజులు జరగనున్న ఈ సత్సంగ్ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి చంద్రాలే భీమ్‌సింగ్ అదృశమయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రాలే భీమ్‌సింగ్ సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు ఆయన ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. కుమారుడు రాజ్‌సింగ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

సిరికొండ: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు మూడో విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. మండలంలోని పంచాయతీల్లో 2023–24 సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేస్తాయని పేర్కొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: ప్రతీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని నాగాపూర్ పంచాయతీ భవనం, కమ్యూనిటీ భవన నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలోని జగదాంబ దేవి, సేవాలాల్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడి ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

ధన్నూర్(బి)లో ఎమ్మెల్యే పర్యటన

ధన్నూర్(బి) గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు జక్క బాపురెడ్డి నివాసానికి ఎమ్మెల్యే వెళ్లారు. కుటుంబ సభ్యులు ఆయన్ను సన్మానించారు. గ్రామంలో ఏలేటి జైపాల్‌రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన దామెర్ల రాజేశ్వర్‌రెడ్డి, మార సుధాకర్‌రెడ్డి కాలి గాయంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీడీ కార్మికుల ధర్నా

బోథ్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కాగా, తహసీల్దార్ సుభాష్ చందర్ వచ్చి వారి సమస్యలను తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్, నరేశ్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పారితోషికం ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇచ్చోడ: సమగ్ర కుటుంబ సర్వే పూర్తిచేసిన ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పారితోషికం ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక ఎంపీడీవో లక్ష్మణ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే పూర్తి చేసి నెల రోజులు కావస్తున్న ప్రభుత్వం నుంచి పారితోషికం అందడం లేదన్నారు. వెంటనే పా రితోషికం అందజేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నాయకులు రాజేందర్, శ్యాంసుందర్, సుభాష్ తదితరులు ఉన్నారు.